

ఇవీ జగనన్న కట్టిన ఊర్లు



రేణిగుంట జీపాలెంలో ఇళ్ల పరిస్థితి

పునాదుల దశలో కొన్ని. గోడల వరకు మరికొన్ని. స్లాబులు అయినవి ఇంకొన్ని. మొదలు కాని ఇళ్లు మరెన్నో? పూర్తయింది మాత్రం అతి స్వల్పం. మౌలిక వసతుల్లేక.. లే అవుట్లలో చెట్లు, ముళ్ల పొదలు పెరిగిపోయి, అక్కడక్కడ నివాస మున్న వారు బిక్కుబిక్కుమంటున్నారు. ఇంకొన్ని లేఅవుట్లయితే చిట్టడవిని తలపిస్తున్నాయి.

మేం ఇళ్లు కాదు.. ఊర్లే నిర్మిస్తున్నాం.. అంటూ సీఎంగా జగన్ చేసిన ప్రకటన. ఇప్పుడు క్షేత్రాయిలో ఆ ఊర్లు ఎలా ఉన్నాయనేది 'ఆంధ్రజ్యోతి బృందం' పరిశీలించింది. పేదల సొంతింటి కలను భగ్నం చేసిన నాటి ప్రభుత్వ తీరు, ఆయా లేఅవుట్ల సచిత్ర కథనం.. 8లో

ఇంటర్ విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు

- 8,293 టెక్స్ట్.. 1,25,820 నోట్ బుక్స్ సరఫరా



ఎస్వీ జూనియర్ కళాశాలలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు సకాలంలో ఉచితంగా పుస్తకాలను అందజేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పినట్టుగానే.. ఈ విద్యాసంవత్సరం అందజేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం గడిచిపోయినా పుస్తకాలు సరఫరా చేయక విద్యార్థులు ఇబ్బంది పడేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. కాలేజీలు ప్రారంభమయ్యే సరికే పుస్తకాలు అందించారు. సాధారణంగా జూన్‌లో జూనియర్ కళాశాలలు ప్రారంభమయ్యేవి. కూటమి ప్రభుత్వం విద్యా విధానంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఈ క్రమంలో ఏప్రిల్ ఒకటి నుంచే ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. అంటే.. రెండు నెలలు ముందే తరగతులు ప్రారంభమైనా ఏమాత్రం ఆలస్యం లేకుండా ప్రభుత్వం టెక్స్ట్, నోట్ పుస్తకాలను సరఫరా చేసింది. జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,216 మంది ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఉన్నారు. వీరికి 8,293 పాఠ్య పుస్తకాలను మంగళవారం ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. సుమారు 1400 మంది తెలుగు మీడియం విద్యార్థులకు మరో వారం, పది రోజుల్లో పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.

61 కళాశాలలకు 1,25,820 నోటుపుస్తకాలు

21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు ఏపీ మోడల్ స్కూల్స్ 5, ఏపీఆర్‌జేసీ 1, కేజీబీవీ 5, హైస్కూల్ ప్లస్ 29 కలుపుకొని.. అన్ని ప్రభుత్వ యాజమాన్య కళాశాలలు 61 ఉన్నాయి. వీటిలోని విద్యార్థులకు 1,25,820 నోటు పుస్తకాలను అందజేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యే నాటికి ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌తో కూడిన పుస్తకాలను సరఫరా చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోందని ఆర్ఐవో తెలిపారు.

'లాసెట్'కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ లాసెట్- 2025 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మూడు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీతో పాటు రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 27వ తేదీ దరఖాస్తుకు చివరి గడువు. వివరాలకోసం 'ఏపీలాసెట్ వెబ్‌సైట్ చూడాలని లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీతాకుమారి తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి ఎక్సైజ్ అధికారుల సదస్సు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో బుధవారం రాష్ట్ర స్థాయి ఎక్సైజ్ అధికారుల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, డైరెక్టర్ నిషాంత్ కుమార్, అన్ని జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండెంట్లు, ఏఈఎస్‌లు, సీఐలు, అధికారులు హాజరుకానున్నారు. నవోదయం-2 అమలు, పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రాకుండా అరికట్టడం, బెల్టు షాపులు కనిపించకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనున్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టడంపైనా చర్చించనున్నారు.

త్వరలోనే మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీ

- తమది కార్యకర్తల పార్టీ అన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



తిరుపతి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): స్టేట్ యూనిట్‌గా కొన్ని.. జిల్లా యూనిట్‌గా మరికొన్ని తీసుకుని త్వరలోనే అన్ని నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కార్యకర్తల పార్టీగా టీడీపీ ఉంటుందన్నారు. తిరుపతిలోని పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రులు, రాష్ట్ర స్థాయి పదవులు పొందినవారు సమయం ఉన్నప్పుడు పార్లమెంటు కార్యాలయాలకు వెళ్లాల్సి వుంటుందన్నారు. అందులోభాగంగా తాను తిరుపతికి వచ్చినట్లు చెప్పారు. తిరుపతిలో, తిరుమలలో గత ఐదేళ్లుగా వైసీపీ నాయకులు ఎంతటి దారుణాలు చేశారో అందరికీ తెలిసిందే నన్నారు. ఇప్పుడు తిరుమల ఎలా ఉందో తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. గత పాలకులు మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరిట ఇష్టానుసారంగా టీడీఆర్ బాండ్లు తీసుకున్నారని, వీటిపై దర్యాప్తు చేసి బాధ్యుల్ని శిక్షిస్తామన్నారు. వైసీపీ నాయకులతో అంటకాగే అధికారులకు ఉద్వాసన ఉంటుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, రవి నాయుడు, జేబీ శ్రీనివాస్, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్సీ శ్రీనివాస్, సుబ్బు యాదవ్, కొట్టే హేమంత్ రాయల్, సుబ్రమణ్యం, యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం. బంగారం, వెండి, చర, స్థిరాస్తులేమో రూ.85 కోట్లకుపైగా ఉన్నట్లు అంచనా. ఇలా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారంటూ ఆయనపై ఫిర్యాదులొచ్చాయి. దీంతో చంద్రగిరి పంచాయతీ పూర్వ కార్యదర్శి మహేశ్వరయ్య ఇంటితో పాటు ఐదుచోట్ల ఏకకాలంగా ఏసీబీ తనిఖీలు చేపట్టింది. రూ.కోట్ల ఆస్తులకు సంబంధించి పత్రాలను అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం.

\- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

మహేశ్వరయ్య మామూలోడు కాదు!

- ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలు



పేరూరులోని ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

ఏకకాలంలో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ తనిఖీలు

రూ.85 కోట్ల ఆస్తులను గుర్తించిన అధికారులు

చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా గతంలో లంచం తీసుకుంటూ పట్టుబడి.. సస్పెండైన వైనం



మహేశ్వరయ్య



అధికారులు సీజ్ చేసిన వాహనాలు

అప్పుడు.. లంచం తీసుకుంటూ..

ఇటీవల చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మహేశ్వరయ్య.. కుప్పం, పలమనేరు, పుంగనూరుతో పాటు వివిధ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. పని చేసిన ప్రతిచోటా ఆయనపై ఆరోపణలు రావడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక ప్రజా ప్రతినిధి అండదండలతో చంద్రగిరికి వచ్చిన ఆయన నాలుగేళ్లలో వారి కనుసన్నల్లో ఇష్టారాజ్యంగా సంపాదించారన్న విమర్శలున్నాయి. పంచాయతీలో ఏ పని కావాలన్నా..బిల్లులు మంజూరు కావాలన్నా.. తనకేంటని అడగతారనే ఆరోపణలు వచ్చా యి. ఆ క్రమంలో చిన్నగొట్టిగల్లుకు చెందిన దినేష్‌రెడ్డి సచివాలయ భవనం నిర్మించారు. దీనికి బిల్లులు మంజూరు చేయడానికి దాదాపు రూ.లక్ష డిమాండ్ చేసినట్లు సమాచారం. అంత ఇచ్చుకోలేక దినేష్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆ తర్వాత మహేశ్వరయ్యకు దినేష్ రెడ్డి రూ.50 వేలు లంచంగా ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో.. ప్రభుత్వం ఆయన్ను సస్పెండు చేసింది. ఇప్పుడాయన బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఇప్పుడు.. ఆదాయానికి మించి ఆస్తులున్నాయని..

తాజాగా.. మహేశ్వరయ్యకు ఆదాయానికి మించిన ఆస్తులున్నాయంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సామాన్య కుటుంబంలో పుట్టిన ఈయన అనతికాలంలోనే రూ.కోట్ల ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. తిరుపతి, కడప జిల్లాలకు చెందిన ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి తిరుపతి రూరల్ పరిధిలోని పేరూరు, చిత్తూరు జిల్లా పలమనేరు, గంగవరం, కడప జిల్లా బద్వేలు, బెంగళూరు, హైదరాబాదులో ఏక కాలంలో సోదాలు జరిపారు. ఈ సోదాలు బుధవారం కూడా కొనసాగనున్నాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు.. పేరూరులోని ఆయన ఇంటి నుంచి కిలో బంగారం, వెండి వస్తువులు, దాదాపు రూ.మూడు లక్షల నగదు, రూ.35 లక్షల విలువ చేసే బ్యాంకు టర్మ్ డిపాజిట్లు, రెండు కార్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పేరూరులో దాదాపు రూ.ఐదారు కోట్ల విలువైన ప్లాట్లు ఉన్నాయి. దాదాపు రూ.85 కోట్ల చర, స్థిరాస్తులు ఉన్నట్లు గుర్తించారు. మహేశ్వరయ్య కూడబెట్టిన అక్రమాస్తుల్లో దాదాపు 60 నుంచి 70 శాతం బినామీల పేరిట పెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. ప్రధానంగా బెంగళూరులో దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే అపార్టుమెంటు ఉన్నట్లు.. పేరూరులోని ఆయన ఇంటి వద్ద డాక్యుమెంట్లు లభించినట్లు తెలిసింది. పలమనేరులో మూడంతస్థుల ఇల్లు, ఒక ఫాం హౌస్ ఉంది. గంగవరంలో ప్లాట్లు, ఒక ఇల్లు ఉన్నాయి. బద్వేలులోనూ వివిధ పేర్లతో ఆస్తులు కూడబెట్టినట్లు తెలిసింది. అక్కడ కొన్ని కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడి అత్త, మామ ఇంట్లో సోదాలు చేస్తున్న తనిఖీ బృందాలు కొన్ని విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంగవరంలో వ్యవసాయ భూములు ఉన్నట్లు రికార్డుల ద్వారా బయట పడింది. వివిధ బ్యాంకుల్లో అకౌంట్లు, లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. వీటికోసం ఆయా బ్యాంకుల మేనేజర్లకు లేఖలు రాయనున్నట్లు తెలిసింది.

గంగవరం ఫాంహౌస్‌లో తనిఖీలు

గంగవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం కూర్నిపల్లె సమీపంలోని మహేశ్వరయ్యకు చెందిన మామిడి తోపు, ఫాంహౌస్‌లో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫాంహౌస్‌లోని గదులు, ప్లైవుడ్ ర్యాక్స్, పలు ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏవైనా రికార్డులు లభించాయా లేదా అన్నది వెల్లడించలేదు. తిరుపతి ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టామని అధికారులు చెప్పారు.



ఫామ్‌హౌస్‌లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

అభివృద్ధే లక్ష్యంగా..

- వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



ఎమ్మెల్యేలు, అధికారులు, టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా.. వేగంగా చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. అందులో భాగంగా శ్రీసిటీ విస్తరణకు అదనంగా 2500 ఎకరాలను కేటాయించడానికి భూసేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు తిరుమల పర్వత పాదాల చెంత నుంచి ఒబెరాయ్ తదితర హోటళ్లను దూరంగా తరలించేందుకు ప్రత్యామ్నాయ భూములు కేటాయిస్తున్నామన్నారు. కొత్తగా లులూ, మహీంద్రా, రహేజా, అట్మోస్పియర్ తదితర సంస్థలు జిల్లాకు వస్తున్నాయని వివరించారు. నాయుడుపేట వద్ద నూతన పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ భూముల కేటాయింపులో అడ్డంకులను తొలగిస్తున్నామని వివరించారు. క్రిస్ సిటీలో రూ.1500 కోట్ల పనులు త్వరగా పూర్తి చేసేలా సమీక్షిస్తున్నామన్నారు. సాగరమాల రోడ్లు, రేణిగుంట-కడప, తిరుపతి-మదనపల్లె రోడ్డు వంటి రూ.6 వేల కోట్ల పనులను ఏడాదిలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైలు మార్గానికి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేశామని, ఇక మిగిలింది రైల్వే పనులేనని స్పష్టం చేశారు. శాప్ చైర్మన్ రవినాయుడు అభ్యర్థన మేరకు తిరుపతి కలెక్టరేట్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్మాణానికి 34 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ క్రీడా ప్రాంగణం నిర్మిస్తామన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

వేసవిలో తాగునీటి సమస్య, జిల్లా అభివృద్ధిపైన, పీజీఆర్ఎస్ అర్జీలపైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించామని మంత్రి వివరించారు. వేసవిలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీనీ పరిశీలించి సాధ్యాసాధ్యాల మేరకు పరిష్కరించేందుకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో.. రీ సర్వేలో వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. పీ4 సర్వేలో వెల్లడైన 20 శాతం మంది పేదలకు సాయం అందేలా ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, దాతలను ఒప్పించాలని కోరారు.

'శెట్టిపల్లె' భూ వివాదానికి శాశ్వత పరిష్కారం

తిరుపతిలోని శెట్టిపల్లె భూముల వివాదానికి త్వరలో శాశ్వత పరిష్కారం చూపిసనస్తామని మంత్రి సత్యప్రసాద్ ప్రకటించారు. దశాబ్దాలుగా ఈ సమస్యకు పరిష్కారం దొరకలేదన్నారు. తమ ప్రభుత్వం రాగానే దీనిపై దృష్టి పెట్టిందని, జిల్లా అధికారులు నెలల తరబడీ కసరత్తు చేసి తుది పరిష్కారం దిశగా నివేదిక సిద్ధం చేశారన్నారు. కలెక్టర్, జేసీ, మున్సిపల్ కమిషనర్ ఇటీవల అమరావతికి వచ్చి ప్రభుత్వానికి నివేదించారన్నారు. త్వరలో శెట్టిపల్లి వాసులు శుభవార్త వింటారని, అక్కడ భూముల అనుభవదారులకు హక్కులు కల్పించడంతో పాటు మోడల్ టౌన్‌షిప్ నిర్మిస్తామన్నారు.

ఓటేరు చెరువుపై లోతుగా పరిశీలిస్తున్నాం

తిరుపతి రూరల్ మండలంలోని ఓటేరు చెరువు భూముల వ్యవహారాన్ని లోతుగా పరిశీలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈ చెరువు భూములు పట్టా భూములని తొలుత రికార్డుల్లో నమోదైందని, తర్వాత చెరువని నమోదైందని, ఇలా భూముల స్వభావం రెవెన్యూ రికార్డుల్లో మార్పుచేర్పులకు గురైందని వివరించారు. ఈ వివాదం కోర్టులో ఉన్నందున ఎక్కువ మాట్లాడలేమన్నారు. రెవెన్యూ రికార్డులను కలెక్టర్ పరిశీలిస్తున్నారని, దానికనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

తిరుపతి డీసీ తీరుపై విచారణ

తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో విచారణ సవ్యంగా సాగకుండా అడ్డుపడుతున్నారని ఫిర్యాదు వచ్చిందని మంత్రి వెల్లడించారు. వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఇదివరకే ప్రభుత్వం బదిలీ చేసినా ఇంకా అక్కడే కొనసాగుతున్నారనీ తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వినాయకసాగర్‌లో నిరసనలపై చట్టపరంగా చర్యలు

ఇటీవల తిరుపతి వినాయకసాగర్ పార్కులో వైసీపీ శ్రేణులు అరగంట పాటు నాటకం ప్రదర్శించి సీఎంను, ప్రభుత్వాన్ని కించపరిచిన విషయమై చట్టపరంగా చర్యలుంటాయని మంత్రి సత్యప్రసాద్ తెలిపారు. దానిపై ఎస్పీకి కమిషనరు ఫిర్యాదు చేశారన్నారు. ఎవరి మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిస్తాం!

తిరుపతిలో జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయిస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఇదివరకే జర్నలిస్టులు వినతిపత్రం ఇచ్చారన్నారు. 700 మంది దాకా ఉన్నారని, అందులో యూట్యూబ్ ఛానెళ్ల ప్రతినిధులూ చాలా మంది వున్నారన్నారు. వడపోసి అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేస్తామన్నారు. మంత్రితో పాటు సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభమ్ బన్సాల్, కమిషనర్ మౌర్య, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, విజయశ్రీ, ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నేతలు ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రమణ్యం, మబ్బు దేవనారాయణరెడ్డి, పులిగోరు మురళి,ఊట్ల సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'టీడీఆర్'పై సమగ్ర విచారణ చేపట్టండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని 'టీడీఆర్' కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టాలని పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, విజయకుమార్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, శ్రీధర్‌వర్మ, హేమంత్ రాయల్ తదితరులు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఇన్‌చార్జి మంత్రి నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రజలతో పాటు టీడీపీ శ్రేణుల నుంచీ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నగరపాలక సంస్థ కార్యాలయంలో 2019-24 మధ్యలో జరిగిన అవినీతిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించినా ఇప్పటికీ స్పందనలేదన్నారు. మున్సిపాలిటీ, తుడాలో పాత అధికారులే కొనసాగుతున్నారని, అక్కడ ప్రక్షాళన చేయాలన్నారు. టీడీఆర్ బాండ్ల అక్రమాలపై చర్యలు తీసుకోవడానికి జాప్యం చేస్తున్నారని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమల స్థానికుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మబ్బు దేవనారాయణరెడ్డి, బుల్లెట్ రమణ తదితరులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి గంగ జాతర నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని ప్రశాంతంగా నిర్వహిస్తాం

- గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై బుధవారం జరిగే అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. మంగళవారం డీఎస్పీతో కలిసి ఆయన మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయం వద్ద 144 సెక్షన్.. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10.30 గంటలకు అవిశ్వాస తీర్మానం ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 40 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. ఇందులో 10 మంది సివిల్ డ్రెస్‌లో ఉంటారన్నారు. మున్సిపల్ కమిషనరు వెంకటరామిరెడ్డి, సీఐ ఏవీ రమణ, ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశ హాలును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

పీఏసీ5 పనులపై అదనపు ఈవో సమీక్ష

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా నిర్మిస్తున్న యాత్రికుల వసతి సముదాయం (పీఏసీ5) పనులను మంగళవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పరిశీలించారు. కల్యాణకట్ట, డైనింగ్‌హాల్, లాకర్ల ఏర్పాటు, మరుగుదొడ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు అన్నమయ్య భవనంలో పీఏసీ5 నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు డిప్యూటీఈవోలు రాజేంద్ర, హరీంద్రనాథ్, వెంకటయ్య, ఈఈలు వేణుగోపాల్, సుధాకర్, డీఈ చంద్రశేఖర్ తదితరులు అదనపు ఈవోతో పాటు పాల్గొన్నారు.

స్వర్ణముఖి తీరాన గోవిందధామం నిర్మాణానికి భూమి పూజ

చంద్రగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది ఒడ్డున గోవిందధామం నిర్మాణానికి మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నానిలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోవిందధామం నిర్మాణం విషయంలో ఎమ్మెల్యే చొరవ తీసుకున్నారన్నారు. సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. . వర్షాకాలంలో అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బంది పడేవారని ఎమ్మెల్యే నాని శాసనసభలో కూడా ప్రస్తావించారన్నారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గోవిందధామం నిర్మాణానికి రూ.5 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. దాతలు ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. దీంతో పలువురు స్పందించారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాల చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యేలకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటరత్నం, వీరంగారి రమేష్‌రెడ్డి, డాక్టర్ వాసు, నాగరాజునాయుడు, ఓంకార్,



కలెక్టర్‌కు విరాళాలను అందజేస్తున్న దాతలు, చిత్రంలో ఎమ్మెల్యే నాని

వీరపల్లి హేమాంబరదరరావు, సుబ్రమణ్యంనాయుడు, నాయకులు కుమారరాజారెడ్డి, శివకోటిరెడ్డి, సింగుసుధా, గౌస్‌బాషా, సర్పంచులు రూపా రామ్మూర్తి, రేవతిప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి కోదండరామ స్వామి వారి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం కన్నులపండువగా సాగింది. ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం చేపట్టారు. 8 గంటలకు ఉత్సవమూర్తులను ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం నరసింహతీర్థం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చిన తీర్థంతో కోదండరాముడికి అభిషేకం చేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ, చతుర్దశ కలశస్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి 7 నుంచి శ్రీరామపట్టాభిషేకం వైభవంగా సాగింది. రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు సీతా, లక్ష్మణ సమేత పట్టాభిరాముడు బంగారు తిరుచ్చిపై, ప్రత్యేక తిరుచ్చిపై ఆంజనేయ స్వామివారు మాడవీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మంత్రి అనగానికి అర్జీల వెల్లువ

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌కు మంగళవారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎదుట బాధితులు క్యూ కట్టారు. గంటకు పైగా సమయం వెచ్చించి ఆయన అర్జీలు తీసుకున్నారు. వాటిని పరిశీలించి అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు అందజేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శెట్టిపల్లి భూముల సమస్యపై పలువురు వినతులిచ్చారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై త్వరగా విచారణ పూర్తి చేసి చర్యలు తీసుకోవాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, పలువురు టీడీపీ నేతలు వినతిపత్రం అందజేశారు. తిరుమల సమస్యలను టీడీపీ నేత కోడూరు బాలసుబ్రమణ్యం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవికి అర్హులైన నేతల జాబితాను మంత్రి అనగానికి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అందజేశారు. రెడ్డి సామాజికవర్గం నుంచీ బాలసుబ్రమణ్యంరెడ్డి, కమ్మ సామాజికవర్గం నుంచీ ఎం.శ్రీనివాసులు, బలిజ సామాజికవర్గం నుంచీ ఆముదాల తులసిరామ్, బీసీ సామాజికవర్గం నుంచీ ఆనంద్ యాదవ్‌ల పేర్లను ఆమె సిఫారసు చేశారు.

పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ కార్యవర్గం



జి.ఎస్.ప్రసాద్



డి.చంద్రమోహన్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్ నూతన కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షులుగా డాక్టర్.జి.ఎస్.ప్రసాద్(ఆంధ్రాబ్యాంకు వీఆర్ఎస్ మేనేజర్), స్విమ్స్ ఆస్పత్రిలో కమ్యునిటీ మెడిసిన్ విభాగం పీఆర్వో దుద్యాల చంద్రమోహన్ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా మధుసూదన్(టీటీడీ శ్వేత అతిథి ఉపన్యాసకులు), ఉపాధ్యక్షులుగా రజని (మహిళా వర్సిటీ పీఆర్వో), సహాయ కార్యదర్శిగా సంస్కార్‌రాజేష్, కార్యవర్గ సభ్యులుగా స్వరాజ్యలక్ష్మి, ఆర్సీకే రాజు, వీవీ.సుబ్రహ్మణ్యం, పుత్తా ఎర్రంరెడ్డి నియమితులయ్యారు. కాగా చాప్టర్ ముఖ్యసలహాదారుగా టీటీడీ చీఫ్ పీఆర్వో డాక్టర్.టి.రవి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా రమాకాంత శర్మ వ్యవహరిస్తారు.

బీజేపీలో చేరికలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం కూడలివద్ద మంగళవారం కిషోర్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లక్ష్మీపురం కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బీజేవైఎం ఆధ్వ ర్యంలో నగరంలో బైక్ ర్యాలీ చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు దస్తగిరి రెడ్డి, దీపక్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ఐపీఎఫ్‌కు సన్మానం



తిరుపతి(సెంట్రల్) ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే జంక్షన్‌లో విధులు నిర్వహించి తిరుపతికి బదిలీ అయిన ఐపీఎఫ్ సందీప్‌కుమార్‌ను దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు బధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి యూనియన్ నాయకులు, సురేష్‌కుమార్, మహ్మద్‌గౌస్, శ్రీనివాసులు, తిరుపతి నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా సరస్వతీ దేవికి ఊంజల్ సేవ

చంద్రగిరి, ఏప్రిల్ 8ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఊంజల్ సేవ వేడుకగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని సరస్వతీదేవిగా అలంకరించిఊంజల్ సేవ నిర్వహించారు.

రోడ్డు ఆక్రమించి గేట్ ఏర్పాటు!

● తుడా ఉద్యోగి తీరుపై బాధితుడి ఆవేదన



దారిలేకుండా అడ్డంగా పెట్టిన గేటు

తిరుపతి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): రోడ్డు కోసం వదిలిపెట్టిన స్థలాన్ని ఒకరు ఆక్రమించుకుని గేటు పెట్టేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తన స్థలంలో ఇల్లు కట్టుకుందామంటే దారిలేకుండా చేయడంతో భావించిన బాధితుడు వేణుగోపాల్ బుధవారం మీడియాతో గోడు వెళ్లబోసుకున్నారిలా.. తుడాలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాచా శ్రీదేవి ఎమ్మార్‌పల్లి సమీపంలోని శ్రీకృష్ణ నగర్‌లోని తన ఇంటి ముందు రోడ్డును ఆక్రమించారు. రోడ్డులోకి ఇతరులెవరూ ప్రవేశించకుండా ఇనుప గేటు పెట్టారు. 1997లో ధనలక్ష్మికి చెందిన దాదాపు 14 సెంట్ల స్థలాన్ని నాలుగు ప్లాట్లుగా విభజించి, ఉత్తరం వైపు పది అడుగుల వెడల్పుండే స్థలాన్ని రోడ్డుకింద చూపించారు. ఈ స్థలాన్ని శ్రీదేవి, మరో ముగ్గురు కొనుగోలు చేశారు. పత్రాలలో ఉత్తరం వైపు పది అడుగుల రోడ్డుకు వదిలినట్టు స్పష్టంగా ఉంది. మున్సిపల్ అధికారులు వేణుగోపాల్‌కు 2021లో ఇచ్చిన వేకెంట్ ల్యాండ్ టాక్స్ నోటీసులోనూ రోడ్డు ఉన్నట్లు ఉంది. అయితే స్థలానికి తూర్పున చివరి ప్లాటులో ఉన్న శ్రీదేవి ఆ రోడ్డును ఆక్రమించి ఇనుప గేటును పెట్టేశారు. ఆక్రమించిన రోడ్డులో నీటి సంప్, లెట్రిన్ పిట్ తవ్వుకుని, మోటార్ పెట్టుకుని, వాహనాల పార్కింగ్‌గా ఉపయోగించుకుంటున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రావడంతో లెట్రిన్ పిట్‌ను మూసివేసి సంపును వరండాలోకి మార్చుకున్నారు. ఏడాది క్రితం ప్లాట్ల ముందు రోడ్డు వేస్తుండగా స్థలంలో రోడ్డు వేయకుండా అడ్డుకున్నారు. శ్రీదేవి ఆక్రమణలో రోడ్డును రక్షించి తన ప్లాటుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని బాధితుడు వేడుకుంటున్నాడు. దీనిపై శ్రీదేవిని వివరణ కోరగా స్థలం తమదేనని బదులిచ్చారు. డాక్యుమెంటు షెడ్యూల్‌లో ఉత్తరం వైపు రోడ్డు ఉన్నట్టు ఉంది కదా? అన్న ప్రశ్నతో ఆమె ఫోన్ పెట్టేశారు.

ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు



తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫ్రీడం ఫ్రమ్ హంగర్స్ నాయకులు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రి వద్ద 400 మందికి అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా రోబో హోటల్ అధినేత భరత్‌కుమార్ రెడ్డి, అభిమానులు హాజరయ్యారు.

నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం తగ్గింపు

తిరుపతి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ఈ నెలాఖరులోపు మొత్తం చెల్లిస్తే 5శాతం తగ్గింపు ఇవ్వనున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. అదేవిధంగా పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు పొందవచ్చునని వివరించారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

శంకరంబాడికి ఘన నివాళి


తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న కవి శంకరంబాడి సుందరాచారి 49వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఘన నివాళులు అర్పించారు. తిరుపతిలోని ఆయన విగ్రహానికి శంకరంబాడి సాహితీ పీఠం, తిరుపతి జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పుష్పాంజలి సమర్పించారు. ఆయన రచించిన రాష్ట్ర గీతం మా తెలుగు తల్లికి మల్లెపూదండను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ డి.మస్తానమ్మ, ఆచార్య గార్లపట్టి దామోదరనాయుడు, సాకం నాగరాజు, రామచంద్రరెడ్డి, ఆకుల మల్లేశ్వర రావు, అంకమ నాయుడు, యువశ్రీ మురళి, డాక్టర్ పరమేశ్వరయ్య పాల్గొన్నారు.



శంకరంబాడి సుందరాచారికి నివాళులు అర్పిస్తున్న సాహితీ పీఠం, తిరుపతి జిల్లా రచయితల సంఘం సభ్యులు

● రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శంకరంబాడి సుందరాచారి విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి, రాజా, సుబ్రహ్మణ్యం రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి(విద్య): స్థానిక గీతం పాఠశాలలో శంకరంబాడి జీవితచరిత్రను నాటికగా ప్రదర్శించారు. 8వ తరగతి విద్యార్థి శ్రీనంద్ కవి వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నాడు. పాఠశాల కరస్పాండెంట్ తమ్మినేని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పవన్‌కల్యాణ్ కుమారుడి ఆరోగ్యం కోసం పూజలు



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కుమారుడు మార్క్‌శంకర్ ఆరోగ్యం కుదుటపడాలని జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. మంగళవారం ఉదయం అలిపిరిలోని పాదాల మండపంలో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హరిశంకర్, అన్నారెడ్డి, యువరాజ్‌రెడ్డి, బాబ్జీ, కీర్తన, రాజేష్‌యాదవ్, పగడాల మురళి, కెఎంకే లోకేశ్, శ్రావణ్, ఆళ్వార్‌మురళి, మునస్వామి, జీవన్, రాధ పాల్గొన్నారు.
● జనసేన సీనియర్ నేత కిరణ్‌రాయల్ ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలి

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదవార్త విని మనసు కలిచివేసిందని మాజీ ఎమ్మెల్యే వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నేడు సాహితీ, కళా ప్రముఖులకు అభినందన సభ

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రచయితల సంఘం, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల ఉగాది పురస్కారాలు అందుకున్న 17 మంది సాహితీ, కళాకారులను సత్కరించనున్నారు. బుధవారం ఉదయం యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున తెలిపారు.

అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం నేతలు సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ స్టార్ కృష్ణ, ప్రసాద్‌రావు, గోపి, పరమశివన్, రాజేష్, దార్ల రఘురాములు, కృష్ణమూర్తి, రమేష్, పుష్పరాజ్, ధనశేఖర్, గిరి పాల్గొన్నారు.








మైక్రోసాఫ్ట్ ఏఐ నైపుణ్యాలపై నేటి నుంచి వర్క్‌షాప్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఏఐ నైపుణ్యాలపై బుధవారం నుంచి వర్క్‌షాప్ నిర్వ హించనున్నారు. మూడురోజుల పాటు సాగే ఈ కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో ప్రారంభం కానుంది. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొననున్నారు.

ముగిసిన యోగా శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా సంస్కృత యూనివర్సిటీలో నిర్వహించిన యోగా శిక్షణ ముగిసింది. సంస్కృత యూనివర్సిటీ - ఎస్వీ ఆయుర్వేద కళాశాల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ రెండు సంస్థల మధ్య సంయుక్త బోధన, పరిశోధనల కోసం ఒక అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద కళాశాల ప్రిన్సి పాల్ రేణుదీక్షిత్, ప్రొఫె సర్ విజయ భాస్కర రెడ్డి, యోగా విభాగాధి పతి పతన్‌కుమార్, అధ్యాపకులు లక్ష్మీ నారాయణ, శివకుమార్, లోకేశ్వర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.





నచ్చే కథలు వస్తే మళ్లీ నటిస్తా

● హీరోయిన్ రంభ

'నచ్చే కథలు వస్తే తప్పకుండా మళ్లీ సినిమాల్లో నటిస్తా' అని క్లారిటీ ఇచ్చారు నటి రంభ. పెళ్లిరోజు సందర్భంగా భర్త ఇంద్రకుమార్ పద్మనాథన్‌తో కలిసి మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాటాడుతూ, వివాహమై 15 ఏళ్లైన సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చామన్నారు. 'సినిమాల్లోనే పుట్టిపెరిగాం. సినిమానే జీవితం. మంచి పాత్రలు వస్తే తప్పకుండా నటిస్తాను' అని రంభ చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రవిశాస్త్రి

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. క్రికెటర్ రవిశాస్త్రి, రేమాండ్స్ గ్రూప్స్ సీఎండీ గౌతమ్ హరి సింఘానియా, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భారతీయ మాస్టర్ హ్యాండ్లూమ్ డిజైనర్ పద్మశ్రీ గజం అంజయ్య, ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ డీజీ వివేక్ శ్రీవాత్సవ ఉన్నారు.

గౌతమ్ హరి సింఘానియా, రవిశాస్త్రి ←




సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం : రూ.4.16 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,503

తలనీలాలు సమర్పించినవారు : 23,941



● వైసీపీ హయాంలో మంజూరైన 65 వేల ఇళ్లలో పూర్తయింది 26 వేలే

● పునాదుల దశ దాటని 22 వేల ఇళ్లు

● 574 లే అవుట్లలో ఒక్కటీ పూర్తి కాని వైనం

● ఎక్కడా కనిపించని మౌలిక వసతులు



ఊరందూరులో నాటి సీఎం జగన్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

జిల్లాలో వేలాది మంది పేదల సొంతింటి కలను గత వైసీపీ ప్రభుత్వం భగ్నం చేసింది. ఐదేళ్లలో సుమారు 65 వేల ఇళ్లు మంజూరు కాగా అందులో 26 వేలు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మరో 22 వేలు పునాదుల దశ దాటలేదు. తొమ్మిది వేల ఇళ్ల నిర్మాణం మొదలే కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 574 లే అవుట్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా కనీసం ఒక్కటంటే ఒక్కటీ పూర్తి కాలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఊరందూరు లే అవుట్‌లో ఎటు చూసినా అసంపూర్తిగా కనిపిస్తున్న పక్కా ఇళ్లు

పేదల సొంతింటి కల భగ్నం

జిల్లాలో 2019-24 నడుమ పీఎం ఆవాస్ యోజన కింద 64,895 పక్కా ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఐదేళ్లు గడిచేటప్పటికి కేవలం 26,855 ఇళ్లు మాత్రమే దాదాపు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వాటిలో కూడా చాలావరకూ ఫినిషింగ్ పనులు పెండింగ్ ఉన్నాయి. కొన్నింటిలోనే లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు. 8,952 ఇళ్ల నిర్మాణం అసలు మొదలే కాలేదు.

574 లే అవుట్లలో ఒక్కటీ పూర్తికాని వైనం

జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వం 574 లే అవుట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి భూములు కేటాయించింది. అందులో 49,022 ఇళ్లు మంజూరు చేసింది. 7,843 ఇళ్ల నిర్మాణ పనులు మొదలే పెట్టలేదు. కేవలం 8,991 ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మిగతా ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. వందశాతం లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని లే అవుట్లు గ్రామాలకు మరీ దూరంగా, అనువుగాని చోట్ల కేటాయించడంతో లబ్ధిదారులు అడుగు కూడా పెట్టలేదు. ఆయాచోట్ల ముళ్లకంపలు పెరిగిపోయాయి. ఏ లే అవుట్‌లోనూ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. మట్టి రోడ్లు, అరకొర విద్యుత్ స్తంభాల ఏర్పాటు తప్ప ఇతర సదుపాయాలు కనిపించడం లేదు.



నీళ్ల లీకేజీతో బురదమయంగా మారిన రోడ్డు

జగన్ శంకుస్థాపన చేసిన లే అవుట్ తీరిలా..

పేదలందరికీ జగనన్న ఇళ్ల పథకాన్ని 2020 డిసెంబరు 28న అప్పటి సీఎం జగన్ శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలో ప్రారంభించారు. ఆ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ పేదల ఇళ్లకు ఊరందూరు వద్ద లే అవుట్‌కు శంకుస్థాపన చేశారు. 6,836 మందికి ఇళ్లు కట్టిస్తామని ప్రకటించారు. కానీ 5,086 మందికే పట్టాలిచ్చారు. అందులో 3,428 మందికే పక్కా ఇళ్లు మంజూరు చేశారు. మౌఖిక ప్రకటన ఆచరణకు వచ్చేసరికి 3,200 ఇళ్లు తగ్గిపోయాయి. మంజూరైన వాటిలోనూ 2,642 ఇళ్ల నిర్మాణమే మొదలైంది. వాటిలో 746 మాత్రమే పూర్తయ్యాయి. ఆ లబ్ధిదారుల్లోనూ కొందరే నివాసం ఉంటున్నారు. మౌలిక సదుపాయాలు లేవు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవు. కొన్ని వీధుల్లో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. జగన్ హామీ ఇచ్చిన శ్రీకాళహస్తి శాటిలైట్ టౌన్‌షిప్ దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం!



కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. అక్కడక్కడా పెట్టిన కొళాయిల నుంచీ తాగునీరు తెచ్చుకుంటున్నాం. తాగునీటి పైపులన్నీ పగిలిపోయి నీరంతా రోడ్లపైకి వస్తోంది. దాంతో మట్టి రోడ్లు బురదగా మారాయి. కాలనీలో కాపురాలు తక్కువ. ఎక్కడ చూసినా సగంలో ఆపేసిన ఇళ్లే. రాత్రయితే వాటిలోకి గంజాయి, మద్యం తాగేవారు వస్తున్నారు. ఆకతాయిల వల్ల రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం.

- గంగ, జగనన్న కాలనీ, ఊరందూరు



చిట్టడవిలా మారిన మంగళంపాడు జగనన్న లే అవుట్

మంగళంపాడులో అడుగుపెట్టని లబ్ధిదారులు

సూళ్లూరుపేట మండలం మంగళంపాడులోని ఎస్సీ పేదల కోసం గత ప్రభుత్వం కిలోమీటరు దూరంలో లేఅవుట్ ఏర్పాటు చేసింది. 44 మందికి పట్టాలు మంజూరు చేసింది. ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి మౌలిక వసతులూ ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు ఆ లేఅవుట్‌లో ఇంతవరకూ అడుగు కూడా పెట్టలేదు. ముళ్లకంపలు, పొదలూ పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తోంది.



గూడూరు: రామలింగయ్య కాలనీ

గూడూరు మున్సిపాలిటీ రామలింగయ్య కాలనీలోని జగనన్న లే అవుట్‌లో 202 మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. 57 మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయి. 65 పునాదుల దశలో ఆగిపోయాయి. మరో 83 బేస్‌మెంట్ దాటి వివిధ దశల్లో నిలిచిపోయాయి. మిగిలిన 71 అసలు పనులే మొదలు కాలేదు. సిమెంటు రోడ్లు, కాలువలు కనిపించవు. మొండిగోడలు, పునాదులకే పరిమితమైన ఇళ్లతో కాలనీ శిథిల వాటికలా కనిపిస్తోంది.

ముళ్లకంపల మధ్య కాపురముంటున్నాం!



చెన్నూరు రామలింగయ్య కాలనీ గూడూరు మున్సిపాలిటీలో ఉందన్న మాటేగానీ సౌకర్యాలూ లేవు. వర్షాకాలంలో మట్టి రోడ్లన్నీ బురదతో నిండిపోతున్నాయి. ఏ వీధిలో చూసినా ముళ్ల కంపలు, పొదలే. వాటి మధ్యే నివాసాలుంటున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోలేదు. స్థోమత లేని చాలా మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేక మధ్యలోనే వదిలిపెట్టేశారు.

- జిలానీ బాషా, రామలింగయ్య కాలనీ

బ్యాండ్‌పాలెంలో స్థలాలు చూపని వైనం

వెంకటగిరి మండలం సోమసానిపల్లి పంచాయతీ బ్యాండ్‌పాలెంలోని 18 మంది పేదలకు గత ప్రభుత్వం ఇళ్ల పట్టాలు.. ఇళ్లూ మంజూరు చేసింది. ఆ స్థలాలు ఎక్కడనేది మాత్రం చూపలేదు. అధికారులు, నాయకుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయిన లబ్ధిదారులు ఆశలు వదిలేసుకున్నారు.

'చెన్నేరి'.. చేదు నిజాలు

సత్యవేడు మండలం చెన్నేరిలో 53 మంది పేదలకు గత వైసీపీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసింది. నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయారు. కాలనీలో 53 ఇళ్లకు గానూ ఒక్కటీ పూర్తి కాలేదు.

సత్యవేడు జగనన్న కాలనీది అదే కథ!

సత్యవేడులోని 350 మంది నిరుపేదలకు గత ప్రభుత్వం పట్టాలు.. ఇళ్లు మంజూరు చేసింది.అందులో200 మంది పనులు మొదలు పెట్టారు. ఐదేళ్లలో కేవలం 50 మాత్రమే పూర్త య్యాయి. వివిధ దశల్లో 150 నిలిచిపోగా మరో 150 ఇంతవరకూ మొదలే కాలేదు.

గిరిజనులకు మిగిలింది గుడిసెలే!

సూళ్లూరుపేట మండలం మంగళంపాడు ఆత్రేయ గ్రామానికి చెందిన గిరిజనుల కోసం గత ప్రభుత్వం జగనన్న ఇళ్ల పథకం కింద కాలనీ మంజూరు చేసింది. గ్రామానికి చేరువలో లే అవుట్ ఏర్పాటు చేయాలని భూమి కేటాయించింది. 33 మందికి పట్టాలు మంజూరు చేశారు. అయితే ఇళ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం అదే లే అవుట్‌లో లబ్ధిదారులైన గిరిజనులు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు.



రేకుల షెడ్డు వేసుకున్న లబ్ధిదారు



సూళ్లూరుపేట మండలం కేసీఎన్ గుంట పంచాయతీ దావాదిగుంట గ్రామంలో 13 మంది పేద ఎస్సీలకు పక్కా ఇళ్లు మంజూరు చేసింది గత ప్రభుత్వం. అంతా నిరుపేదలు కావడంతో పది మంది నిర్మాణాల జోలికే పోలేదు. ఇద్దరు మాత్రమే స్లాబ్ దాకా పనులు పూర్తి చేసి ఫినిషింగ్ చేయలేక వదిలిపెట్టేశారు.ఓ లబ్ధిదారుడు తనకు కేటాయించిన స్థలంలో రేకులతో తాత్కాలికంగా షెడ్డు వేసుకుని నివాసముంటున్నాడు.



తిరుపతి పేదలకూ తప్పని నిరాశ


తిరుపతి నగర పరిధిలోని పేదలకు ఏర్పేడు, చంద్రగిరి, వడమాలపేట, రేణిగుంట మండలాల్లో ఆరు లే అవుట్లు మంజూరు చేసింది. రేణిగుంట మండలం జీపాలెం గ్రామంలో 34 ఎకరాల లే అవుట్‌లో 1,753 పక్కా ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పటికీ పది శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. ఎలాంటి సదుపాయాలూ కల్పించలేదు.

రేణిగుంట జీపాలెంలో ఇళ్ల పరిస్థితి



ఒకరి మృతికి కారణమైన నిందితుడి అరెస్టు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలం కోటంబేడుకు చెందిన తాడి వెంకటరమణయ్య మృతికి కారణమైన కొండా శివయ్యని అరెస్టు చేసినట్లు సీఐ రమణ తెలిపారు. వెంకటగిరి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. గత నెల 30వ తేదీన తాడి వెంకటరమణయ్య, కొండా శివయ్య వేటకు వెళ్లారు. తిరిగి మోటర్ సైకిల్‌పై వస్తుండగా నాటు తుపాకీ పేలడంతో వెంకటరమణయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. శివయ్య భయంతో పక్కనే ఉన్న కాలువలో మృతదేహాన్ని పడేశాడు. మృతదేహం నీళ్లలో తేలుతుండడంతో కాలువలో నుంచి బయటకు లాగి పక్కనే ఉన్న ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిపోయాడు. అప్పట్నుంచి తప్పించుకుని తిరుగుతున్న శివయ్యను మంగళవారం అరెస్టు చేశామని, ఆయన వద్ద ఒక నాటు తుపాకీ, 114 గ్రాముల నల్లమందు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. నిందితుడిని బుధవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు. కార్యక్రమంలో బాలాయపల్లి ఎస్‌ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.



దైవచింతన పెంపొందించుకోవాలి

● కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

రామచంద్రాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతన పెంపొందించుకోవాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి అన్నారు. రామచంద్రాపురం మండలం కుప్పంబాదురు సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆయనకు ఆశ్రమ పీఠాధిపతి కైలాస్ గురూజీ శిష్య బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమ ప్రాంగణంలో మొక్కను నాటి నీరు పోశారు. ఎన్టీఆర్ ట్రస్టు నిర్వహించిన రక్తదాన శిబిరంలో వందమంది రక్తదానం చేశారు. స్వామిజీ ఆశ్రమంలో సీతారామ సమేత రామలక్ష్మణ, హనుమంత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీను షా (ఫైల్ ఫొటో)

తిరుమలలో తమిళనాడువాసి అదృశ్యం

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల వచ్చిన తమిళనాడు భక్తుడు కనిపించకుండాపోయాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నైకు చెందిన ఆర్ శ్రీను షా(53) ఈనెల 5న శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. వెంగమాంబ అన్నప్రసాదభవనంలో అన్నప్రసాదాలు స్వీకరించాక చెప్పులు వేసుకుని వస్తాని వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతని సోదరుడు కుబేర్ షా తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు తెలిసిన వారు 94407 96769 నంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

సదరన్ డిస్కం కాంట్రాక్టు కార్మికుల దీక్ష విరమణ



సీఎండీతో చర్చలు జరుపుతున్న సీఐటీయూ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం 15 రోజులుగా డిస్కం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పట్ల సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు సానుకూలంగా స్పందించారు. సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట సోమవారం జరిగిన మహాధర్నా సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం సీఎండీతో చర్చలు ఏర్పాటు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ గతంలో అధికారులు ఇచ్చిన హామీలు అమలు, వేతనాలు పెంపు, ఇతర అంశాలను సీఎండీ దృష్టికి తెచ్చారు. తమ పరిధిలో వున్న సమ్యలను పరిష్కరిస్తామని, మిగిలిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సీఎండీ హామీ ఇచ్చారు. దీంతో రిలే దీక్షలను బుధవారం విరమించుకున్నామని సంఘం నాయకులు కుమార్ తెలిపారు. అధికారులు డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, పఠాన్ అయూబ్ ఖాన్, సీజీఎం హెచ్‌ఆర్‌డీ రమణాదేవి, కార్మిక సంఘాల నాయకులు శివప్రసాద్ రెడ్డి, రవికుమార్, జలీల్‌బాషా, హుసేన్‌పీరాం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోలీసు బ్యాడ్మింటన్ పోటీలకు తిరుమల కానిస్టేబుల్ ఎంపిక



వాసుదేవ రావు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేరళలో ఈ నెల 11 నుంచి 15వ తేది వరకు జరగనున్న ఆలిండియా పోలీసు బ్యాడ్మింటన్ పోటీలకు తిరుమల వన్‌టౌన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వాసుదేవ రావు ఎంపికయ్యారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈయన.. కానిస్టేబుల్‌గా తిరుపతి జిల్లాలో నియమితులయ్యారు. తొలినుంచీ ఆటలపై ఈయనకు ఆసక్తి ఉంది. గత ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు విజయవాడలో జరిగిన పోలీసు బ్యాడ్మింటన్ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొని సింగిల్స్ విభాగంలో ప్రతిభ చూపారు. ఈ క్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈయనకు జిల్లా పోలీసు శాఖ అభినందనలు తెలిపింది.

సినీనటుడు సప్తగిరికి మాతృ వియోగం



తిరుచానూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సప్తగిరి తల్లి చిట్టెమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందారు. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీ తిరుమలనగర్ వీధిలోని నివాసం వద్దకు ఆమె భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. బుధవారం మధ్యాహ్నం గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సప్తగిరి 'ఆంధ్రజ్యోతి'కి తెలియజేశారు.

హథీరాంజీ మఠం భవనంపై 20లోపు చర్యలు తీసుకోవాలి!

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హథీరాంజి మఠం భవనంపై ఈనెల 20వ తేదీ లోపు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మఠం భవనం శిథిలావస్థకు చేరుకున్న దుస్థితిపై మంత్రి చర్చించినట్లు సమాచారం. ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి ఈ అంశం వెళ్లిన నేపథ్యంలో భవనం ప్రమాదం జరగకముందే ఈనెల 20 లోపు సమన్వయ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ పూజ


సీతారాముల మాఢవీధి ఉత్సవం

గూడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి మాడవీధి ఉత్సవం జరిపారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ గరుడ చిత్రపటానికి పూజలు నిర్వహించి, ధ్వజస్థంభానికి అభిషేకం చేశారు. గరుడ చిత్రపటాన్ని ధ్వజస్థంభంపై ఎగుర వేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోపేతంగా నిర్వహించారు. భక్తులు కొడి ముద్దలను పట్టుకునేందుకు పోటీ పడ్డారు. రాత్రికి స్వామివారిని శేష వాహనంపై అలంకరించి గ్రామోత్సవం జరిపారు. డాక్టర్ మైథిలి, రమణ బాబు, డాక్టర్ నరసారెడ్డి, సుష్మా కుటుంబసభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు.

డీఆర్‌డీఏ ఏపీడీ క్షేత్రస్థాయి పరిశీలన


వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడి ప్రభావతి

దొరవారిసత్రం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం వెలుగు కార్యాలయాన్ని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి మంగళవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన నిమిత్తం విచ్చేసిన ఆమె కార్యాలయంలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వార్షిక రుణ, జీవనోపాధి ప్రణాళికలపై సమీక్షించారు. ఏకొల్లు గ్రామానికి వెళ్లి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం అయ్యారు. రుణాల వినియోగం, కుటుంబాల ప్రగతిపై ఆరా తీశారు. ఆమె వెంట జిల్లా జీవనోపాధులు ప్రాజెక్టు మేనేజర్ ధనంజయ్యరెడ్డి, డీపీఎం విజయ్‌కుమార్, ఏపీఎం మునిరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీ సర్వే

చిట్టమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలోనే రీ సర్వే చేయాలని తహసీల్దార్ సతీష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో నార్తువర్తూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రీ సర్వే ద్వారానే భూ సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు. గతంలో 21 గ్రామాల్లో రీ సర్వే జరిగిందని, పలు అవక తవకలు జరిగడంతో ప్రభుత్వం మళ్లీ రీ సర్వే చేపట్టాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటేష్, వీఆర్వో శివ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

నాయుడుపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకుడు శివకవి ముకుంద డిమాండ్ చేశారు. మంగళవారం నాయుడుపేట సీఐటీయూ కార్యాలయం వద్ద పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా కట్టెల పొయ్యి వెలిగించి వంటవార్పు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచుతూ పేదల నడ్డి విరుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరయ్య, అంకయ్య, వెంకటేశ్వర్లు, రవి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో మంటలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని హోలీక్రాస్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న డంపింగ్ యార్డులో మంగళవారం మంటలు చెలరేగాయి. గుర్తు తెలియని వ్యక్తులు డపింగ్ యార్డులో చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. జాతీయ రహదారిపై దట్టంగా పొగ కమ్ముకోవడంతో కాకుండా పట్టణంలోకి పొగ వ్యాపించడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ అధికారులు డంపింగ్‌యార్డు వద్దకెళ్లి పరిశీలించారు. అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఏప్రిల్ 13న గురుకులం ప్రవేశ పరీక్షలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఏప్రిల్ 13న పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎల్ఏ సాగరంలోని బాలుర గురుకుల, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ దాదాపీర్ తెలిపారు. ఏప్రిల్ 13వ తేదీ ఆదివారం ఉదయం 10నుంచి 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం 2నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు.

ఇద్దరు డిగ్రీ విద్యార్థుల డీబార్

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌వర్మ తెలిపారు.

రైతుల సమక్ష్యంలోనే రీ సర్వే

చిట్టమూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రైతుల సమక్ష్యంలేనే రీ సర్వే చేయాలని తహసీల్దార్ శతీష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో నార్తువర్తూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రీ సర్వే ద్వారానే భూ సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు. గతంలో 21 గ్రామాల్లో రీ సర్వే జరిగిందని, పలు అవక తవకలు జరిగడంతో ప్రభుత్వం మళ్లీ రీ సర్వే చేపట్టాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటేష్, వీఆర్వో శివ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజన్

- ఆరుగురు చిన్నారులకు అస్వస్థత
- నాయుడుపేట సీహెచ్‌సీలో చికిత్స


చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

పెళ్లకూరు, నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని కానూరు దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో పులిహోర తిన్న ఆరుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం కానూరు దళితవాడలోని అంగన్వాడీ కేంద్రానికి ఏడుగురు చిన్నారులు హాజరయ్యారు. ఎండలు అధికంగా ఉండడంతో మధ్యాహ్నం భోజనానికి ముందే ఇద్దరు చిన్నారులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. అంగన్వాడీ వర్కర్ శ్రీదేవి నాయుడుపేటలో జరిగిన సెక్టార్ మీటింగ్‌కు వెళ్లారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న గురువర్షిత్, గురవయ్య, జోషన్, జస్వన్, నానితో పాటు ఓజిలి మండలం కురుగొండకు చెందిన మరో చిన్నారి శాన్వికకు రోజువారి మెనూలో భాగంగా ఆయా రాఘమ్మ నిమ్మరసంతో పులిహోర చేసి వడ్డించారు. తిని ఇళ్లకు వెళ్లిన చిన్నారులు కొద్దిసేపటికే వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే చిన్నారులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పెళ్లకూరు మండల టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పాలచ్చూరు నరేంద్రయాదవ్ తదితరులు చిన్నారులను పరామర్శించారు. నాయుడుపేట ఐసీడీఎస్ సీడీపీవో కొండ్రెడ్డి ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐలు నాగరాజు, ఆదిలక్ష్మి ఆస్పత్రికి చేరుకుని చినారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సీడీపీవో ఉమామహేశ్వరి చెప్పారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయశ్రీ ఆస్పత్రికి వెళ్లి చిన్నారులను, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ చంద్రకళతో మాట్లాడి చిన్నారుల ఆరోగ్యం గురించి చర్చించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, గూడూరు సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.161 కోట్లతో తిమ్మాజికండ్రిగ - పండ్లూరు రోడ్డు విస్తరణ


పండ్లూరు రైల్వే గేట్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

ఓజిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ - చెన్నై పారిశ్రామిక ప్రాంత అభివృద్ధిలో భాగంగా నాయుడుపేట మండలం తిమ్మాజికండ్రిగ నుంచి ఓజిలి మండలం గ్రద్దగుంట, కొత్తపేట, పున్నేపల్లి గ్రామాల మీదుగా పండ్లూరు వద్ద జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డును మంగళవారం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. 45 మీటర్ల వెడల్పుతో 8.7 కిలోమీటర్ల దూరం విస్తరించాలని నిర్ణయించారు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నిధులు రూ.161 కోట్లు వెచ్చించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఏడు గ్రామాల పరిధిలో 68.16 ఎకరాల వ్యవసాయ భూములకు, ఓజిలి మండలంలోని లక్ష్మీపురం, పాపిరెడ్డికండ్రిగ, కొత్తపేట గ్రామాల పరిధిలో ఇళ్లు కోల్పోతున్న 29 మంది నష్టపరిహారం చెల్లించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. భూసేకరణలో పొలాలు, ఇళ్లు కోల్పోతున్న వారి వివరాలను సామాజిక నిపుణుడు దేవరాజు ఆర్డీవో కిరణ్మయికి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ పరమేశ్వరి, ఓజిలి, నాయుడుపేట తహసీల్దార్లు పద్మావతి, రాజేంద్ర, ఆర్‌అండ్‌బీ ఏఈ చిన్నరాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి: విజయశ్రీ


ఎస్పీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కోరారు. మంగళవారం ఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్యే పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా గంజాయి రహిత పట్టణాలుగా తీర్చిదిద్దాలని కోరారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించారు. అలాగే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో సమస్యలపై చర్చించారు.

పొట్టి శ్రీరాములు విగ్రహ ప్రాంతం ఆధునికీకరణ


పొట్టి శ్రీరాములు విగ్రహ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్

నాయుడుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ప్రాంతాన్ని ఆధునికీకరిస్తామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. మంగళవారం ఆర్యవైశ్యసంఘ జిల్లా అధ్యక్షుడు గూడూరు కిషోర్, ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి నాగరాజుతో కలిసి అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహ ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. ఆర్టీసీ ప్రాంగణం ప్రహరీ కూలిపోవడం, ఆ ప్రాంతంలో ప్రధాన డ్రైనేజీ కాలువపై బండలు లేకపోవడాన్ని గుర్తించారు. కౌన్సిల్ ఆమోదంతో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు బాబు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా పోషణ్ పక్వాడా


యాప్ డౌన్‌లోడ్ చేసే విధానాన్ని చూపుతున్న సీడీపీవో మునికుమారి

కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ నెల 8నుంచి 22వ తేదీ వరకు పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాలపై వాకాడు, చిట్టమూరు, కోట మండలాల అంగన్వాడీ వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి రెండేళ్ల లోపు శిశువుకు పోషకాహారం ఇచ్చే విషయమై తల్లికి అవగాహన కల్పించాలన్నారు. ఊబకాయం ఉన్న పిల్లలు పోషకాహారంతో పాటు మిటమిన్లు ఉన్న ఆహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల నిర్వహణలో నిర్లక్ష్యం చేసే అంగన్వాడీ వర్కర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీడీపీవో హెచ్చరించారు. సమావేశంలో సూపర్ వైజర్లు సరిత, కృష్ణమ్మ, శేషమ్మ, రత్నమ్మ, తదితరులు ఉన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం


కోదండరామస్వామి కల్యాణం చేస్తున్న వేదపండితులు

కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సీతా సమేత కోదండరామస్వామి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. వేదపండితులు భక్త జనసందోహం నడుమ సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. కల్యాణం అనంతరం తలంబ్రాలు కోసం భక్తులు పోటీపడ్డారు.

పుత్తూరు వార్తలు

గ్యాస్ ధరలను తగ్గించాలి: సీపీఎం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై గుదిబండగా భారం మోపిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని మంగళవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో తలపై గ్యాస్ సిలిండర్ పెట్టుకుని వినూత్నంగా ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలపై గ్యాస్ ధరలు పెంచడం దారుణమని వాపోయారు. పెంచిన ధరలను తగ్గించాలని, లేదంటే ఉద్యమాలు, పోరాటాలు ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు విజయ్, సుబ్రమణ్యం, యాసిన్‌బాషా, శివ, నాయుడు, రామలింగం, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం భావితరాలకు ఆదర్శం


టీడీపీ సభ్యత్వ కార్డులతో కార్యకర్తలు

వడమాలపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం భావితరాలకు ఆదర్శమని జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముద్దులూరు సుకుమార్ చెప్పారు. మండలంలోని ఎస్బీఆర్‌పురంలో మంగళవారం టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డులను కార్యకర్తలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఆర్‌పురం పంచాయతీ 30వ వార్డులో 90 శాతం సభ్యత్వం నమోదు చేశామని, వారందరికీ సభ్యత్వ కార్డులు అందజేశామని చెప్పారు. నిస్వార్థంగా పార్టీని నమ్ముకున్న వారందరికీ న్యాయం జరుగుతుందని, అవకాశం కోసం పార్టీ పేరు చెప్పుకుని రాజకీయాలు చేసే వారికి కార్యకర్తలే భవిష్యత్తులో బుద్ధి చెబుతారని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ టీడీపీ జెండా రవి, హరిరాజు, శివశంకర్, భరత్‌కుమార్, మోహన్, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించి 5 శాతం రాయితీ పొందండి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పురపాలక సంస్థ పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగా పన్ను బకాయిలను ఏకమొత్తంగా చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. 2025 - 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను బకాయిలకు 5 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పురపాలక కౌంటర్‌తో పాటు ఆయా సచివాలయాల్లో, ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించవచ్చని విజ్ఞప్తి చేశారు.

క్షయ వ్యాధిగ్రస్థుల కుటుంబాలకు పరీక్షలు నిర్వహించాలి

పుత్తూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాధిగ్రస్థుల కుటుంబీకులు, సన్నిహితులకు పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ ఆశా కోరారు. అర్బన్ పీహెచ్‌సీలో మంగళవారం ఆశ వర్కర్లు, ఏఎన్ఎం, క్షయవ్యాధి నిర్మూలన సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ మండలంలో 30 మంది క్షయ వ్యాధి పీడితులు ఉన్నారని అన్నారు. వీరి కుటుంబాలను సందర్శించి ఇంట్లో వున్న రక్తసంబంధీకులు, సన్నిహితంగా మెలిగే వ్యక్తులను గుర్తించి పరీక్షలు చేయాలని అన్నారు. పాజిటివ్ వచ్చిన వారికి వెంటనే మందులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బందితో పాటు క్షయ నిర్మూలన సూపర్‌వైజర్లు తిరుమల, నవీన్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను వైద్యసిబ్బందిగా గుర్తించాలి


పీహెచ్‌సీలో డాక్టర్ ఆశాకు వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

పుత్తూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లను వైద్యసిబ్బందిగా గుర్తించాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత, మండల అధ్యక్షురాలు మారెమ్మలు డిమాండ్ చేశారు. మంగళవారం అర్బన్ పీహెచ్‌సీలో డాక్టర్ ఆశాకు ఆశా వర్కర్లు తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా హేమలత, మారెమ్మలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో ఇచ్చిన హామీల మేరకు ఉత్వర్వులు ఇవ్వాలని, ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ26 వేల వేతనం, గుర్తింపు కార్డులు ఇవ్వడం తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. గోవిందపాలెం, గొల్లపల్లి, పరమేశ్వరమంగళం పీహెచ్‌సీల్లో కూడా ఆశ వర్కర్లు ఆయా డాక్టర్లకు వినతి పత్రాలు అందించారు. జిల్లా, మండల నాయకులతో పాటు ధనలక్ష్మి, హరిత, లక్ష్మీదీప, నాగజ్యోతి పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన అన్న క్యాంటీన్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): ఎట్టకేలకు పుత్తూరులో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదిరింది. గత ఏడాది అక్టోబర్ నుంచి పనులు సాగాయి. ఉగాదికి ప్రారంభం కావాల్సి ఉండగా నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా వాయిదా పడింది. బుధవారం ఉదయం 12 గంటలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా అన్న క్యాంటీన్ ప్రారంభం జరుగనుంది. పుత్తూరు పరిసర ప్రాంతాల నుంచి వివిధ అవసరాల కోసం వచ్చే పేదలతో పాటు ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారికి అన్న క్యాంటీన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందంటున్నారు.

మృతుల కుటుంబాలకు రోజా పరామర్శ


మృతి చెందిన ఏఎస్ఐ, శివ కుటుంబీకులను పరామర్శిస్తున్న రోజా

పుత్తూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలో ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాలను మంగళవారం మాజీ మంత్రి రోజా పరామర్శించారు. వేపగుంట పంచాయతీ అక్కేరి హరిజనవాడకు చెందిన ఏఎస్ఐ రఘు కుటుంబీకులను, స్థానిక ఎన్‌జీవో కాలనీలో శివ కుటుంబీకులను ఆమె పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపిపి మునివేలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్యూఆర్‌కోడ్ ద్వారా దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారం

వడమాలపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతన సాంకేతిక ఆధారంగా చేపట్టే భూ ఆధారిత సర్వేలో క్యూఆర్ కోడ్ ద్వారా దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ జరీనా చెప్పారు. మంగళవారం మండలంలోని వేమాపురంలో రెండవ విడత భూ రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సేవలు రైతులు ఉచితంగా పొందవచ్చని చెప్పారు. పాస్ బుక్‌లలో తప్పులకు సంబంధించి రికార్డుల ఆధారంగా మార్పులు చేసి, యజమానికి అనుకూలంగా ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా రైతుల్లో చైతన్యం కలిగించడానికి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి చిట్టిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానీ బాషా, సర్వేయర్ గురువారెడ్డి, వీఆర్వోలు చక్రవర్తి, భూపతి, విలేజ్ సర్వేయర్లు, గిరిబాబు, కిషోర్, రూప, రైతులు పాల్గొన్నారు.

పింఛను ఇప్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుడైన తన కుమారుడు వరుణ్‌కు పింఛను ఇప్పించాలని సత్యవేడు మండలం మల్లవారిపాళెం పంచాయతీకి చెందిన వెంకటేష్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విన్నవించారు. జిల్లా కలెక్టరేట్ వేదికగా మంగళవారం ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు.

పరిహారం చెల్లించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తమ ఇళ్ల నిర్మాణాలకు నష్టపరిహారం చెల్లించాలని రైల్వే లైనుతో ఇళ్లు కోల్పోయిన రేణిగుంట మండలం తూకివాకం వద్దనున్న షికారీలు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. జిల్లా కలెక్టరేట్ వేదికగా మంగళవారం ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందించారు. అక్కడే ఉన్న కలెక్టర్ స్పందిస్తూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల్‌సేవ

నారాయణవనం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు పద్మావతి అమ్మవారి ఊంజల్‌సేవను వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కోట మండల బీజేపీ అధ్యక్షుడిగా సురేష్


పులి సురేష్‌ను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోట మండల బీజేపీ అధ్యక్షుడిగా పులి సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సురేష్‌ను బీజేపీ నాయకులు పూల మాలలు శాలువాలతో అభినందించారు. ఎన్నికల అధికారి వ్యవహరించిన డాక్టర్ శ్రీహరి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పులి సురేష్ చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, గిరిధర్‌రెడ్డి, వెంకయ్యగౌడ్, సారంగం రమేష్, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీ5 పనులపై అదనపు ఈవో సమీక్ష

తిరుమల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా నిర్మిస్తున్న యాత్రికుల వసతి సముదాయం(పీఏసీ5) పనులను మంగళవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పరిశీలించారు. కల్యాణకట్ట, డైనింగ్‌హాల్, లాకర్ల ఏర్పాటు, మరుగుదొడ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు అన్నమయ్య భవనంలో పీఏసీ5 నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు డిప్యూటీఈవోలు రాజేంద్ర, హరీంద్రనాథ్, వెంకటయ్య, ఈఈలు వేణుగోపాల్, సుధాకర్, డీఈ చంద్రశేఖర్ తదితరులు అదనపు ఈవోతో పాటు పాల్గొన్నారు.

మినీలారీ సహా 10 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- ఒకరి అరెస్టు


నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మినీలారీ సహా పది టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం రిజర్వాయర్ ప్రాంతం నుంచి ఏర్పేడు మండలం మునలిపేడు మీదుగా రేషన్‌బియ్యం అక్రమంగా తరలుతున్నట్లు తిరుపతి విజిలెన్సు అధికారులు నిఘా ద్వారా పక్కా సమాచారం సేకరించారు. తిరుపతి విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు సీఐ వెంకటరవి, ఎస్ఐ రామకృష్ణనాయక్ సిబ్బందితో సోమవారం రామాపురం వద్ద గస్తీ నిర్వహించారు. కేవీబీపురం మండలం కోవనూరుకు చెందిన రాజు అనే యువకుడు మినీలారీలో పది టన్నుల రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా మాటువేసి పట్టుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్సు సీఎస్‌పీడీ రవీంద్రబాబు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటాద్రి, కానిస్టేబుల్ అయ్యప్ప పాల్గొన్నారు. రేషన్ బియ్యం విలువ రూ.3.51 లక్షలుగా అంచనా వేశారు.

శ్రీకాళహస్తి సమస్యలను పరిష్కరించండి

● మంత్రి అనగాని, కలెక్టర్‌తో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మంత్రి సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన డివిజనల్ వేదికగా ఎమ్మెల్యే నియోజకవర్గం పరిధిలోని పలు సమస్యలపై అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రేణిగుంటలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. శ్మశానవాటికలో కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌కాలనీలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూకబ్జాలపై విచారణ చేసి పేదలకు ఇప్పించాలని వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు ఇబ్బందికరంగా మారిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఆదిమూలం



రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మొదటగా కోటమంగాపురంలో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. వగత్తూరులో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఇల్లులేని పేదలకు పొజిషన్ పత్రాలను అందజేశారు. రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. మండలంలో రైతులు నష్టపోకుండా సాధ్యమైనంత త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మునిరత్నంరెడ్డి, వ్యవసాయాధికారి మురళీకృష్ణకుమార్, నాయకులు డాక్టర్ రమేష్, మాజీ ఎంపీపీ మణి, మాజీ జడ్పీటీసీ శ్రీహరియాదవ్, సురేష్‌రెడ్డి, సర్పంచ్ బాలాజీ, ప్రవీణ్, అయ్యప్ప, సర్పంచ్ గోపాల్, ఏఈ ప్రవీణ్, బీజేపీ మండలాధ్యక్షుడు బాబుయాదవ్, జనసేన మండలాధ్యక్షుడు థామస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నరసింహయాదవ్‌కు సన్మానం



నరసింహయాదవ్‌ను సన్మానిస్తున్న గాలి మురళీ నాయుడు, ప్రకాష్ నాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్ ఇటీవల రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. టీడీపీ పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు తక్కలపాటి ప్రకాష్ నాయుడు, తొట్టంబేడు మండలాధ్యక్షుడు గాలి మురళీ నాయుడు తిరుపతిలో ఆయన్ను కలిసి ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అత్తిరాల భాస్కర్‌గౌడ్, నీలవర్ణం యాదవ్, షేక్ రఫీ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలుగు చూసిన ఘటన శ్రీకాళహస్తి మండలం రామాపురం రిజర్వాయర్ వద్ద మంగళవారం జరిగింది. రిజర్వాయర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికుడు గుర్తించారు. అతడి వద్ద రెండు సెల్‌ఫోన్లు, రూ.10వేలు నగదు ఉన్నట్లు గుర్తించారు. స్థానికులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.8ఎస్‌కెటి11) గుర్తు తెలియని మృతదేహం

సకాలంలో పన్నులు చెల్లించి రాయితీ పొందండి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీజాగా పన్నులను ఈ నెల 30వ తేదీ లోపు చెల్లించి 5శాతం రాయితీ పొందాలని కమిషనర్ గిరికుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం కూడా ప్రత్యేక కౌంటర్ల ద్వారా చెల్లించవచ్చన్నారు. ఉదయం 7 నుంచి రాత్రి 8గంటల లోపు పన్నులు చెల్లించి పురపాలకసంఘ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.

జాబ్‌మేళా గోడపత్రికల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించే జాబ్‌మేళాకు సంబంధించి గోడపత్రికలను మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పరిశీలన

సత్యవేడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసుకుప్పంలో మంగళవారం డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పర్యటించారు. గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గోకులం షెడ్డు, సీసీరోడ్డును పరిశీలించారు. గోకులం, సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ఇంకా మంజూరు కాలేదని, లబ్ధిదారులు, గుత్తేదారులు పీడీ దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్ బిల్లులు త్వరలోనే మంజూరవుతాయని పీడీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవో విజయభాస్కర్, జేఈ హరి, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్ టీడీపీ నాయకులు లోకయ్యరెడ్డి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినులకు నోట్ పుస్తకాల పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయులు రమణయ్య మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థినికి 12 నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

రీసర్వేపై ర్యాలీ

వరదయ్యపాళెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలవారిపాళెంలో రెవెన్యూ అధికారులు రీసర్వే ప్రాజెక్టుపై మంగళవారం అవగాహన ర్యాలీ చేశారు. ప్రజలకు రీసర్వే వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ప్రసాదరావు, మండల భూ సర్వే అధికారి వెంకటరమణయ్య, గ్రామ సర్వేయర్లు రూప్‌చంద్, హరీష్, మునస్వామి, దొరస్వామి, హేమంత్, సర్పంచ్ చంద్రారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

నారాయణవనం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసే ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నిరోషా, సుహాసిని పేర్కొన్నారు. మంగళవారం నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

వలస కార్మికుడి ఆత్మహత్య



సన్నికుమార్ మృతదేహం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వలస కార్మికుడు సన్నికుమార్(26) రైలు పట్టాలపై నిలబడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన సోమవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద చోటు చేసుకుంది. బిహార్ రాష్ట్రానికి చెందిన సన్నికుమార్ రాచగున్నేరిలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. సోమవారం రాత్రి రాచగున్నేరి సమీపంలోని రైలుపట్టాలపై నిలబడ్డాడు. తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపుగా వెళ్లే రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు ఘటనా స్థలానికి చేరుకుని మంగళవారం శవానికి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రికెట్ టీమ్‌ల మధ్య ఘర్షణ

రేణిగుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆడుతుండగా చిన్న వివాదం కాస్తా రెండు టీముల క్రీడాకారులు ఒకరిపై మరొకరు పరస్పరం దాడులు చేసుకునే వరకు దారితీసింది. స్థానికుల కథనం మేరకు మండల పరిధిలోని ఎస్‌యూ పురంలో యువకులు సోమవారం క్రికెట్ ఆడుతుండగా చిన్నపాటి వివాదం ఘర్షణకు దారితీసింది. ఇదే సమయంలో సర్ది చెప్పేందుకు స్థానికంగా ఉన్న ఒక వృద్ధుడు ప్రయత్నించగా అతడిని కిందకు తోసివేయడంతో తలకు గాయమైంది. దీంతో తిరిగి రాత్రి గ్రామంలో ఇరు టీముల సభ్యులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఇరు టీం సభ్యులు ఒకరిపై మరొకరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

రేణిగుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న దొంగను అరెస్టు చేసి గాజులమండ్యం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గాజులమండ్యం స్టేషన్ రైటర్ సారథి తెలిపిన వివరాల మేరకు... తిరుపతి రేణిగుంట మార్గంలోని పారిశ్రామిక వాడలోని ఓ కంపెనీలో రాపూరు మండలం అఖిలవలస గ్రామానికి చెందిన వై.ప్రసాద్ పని చేస్తున్నాడు. దొంగతనాలకు అలవాటుపడిన ఇతడు పారిశ్రామికవాడలోని కంపెనీల్లో తరచూ చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ మంగళవారం ఓ ద్విచక్ర వాహనాన్ని చోరీ చేస్తుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండుకు తరలించినట్లు స్టేషన్ రైటర్ తెలిపారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ గుడివీధిలోని చక్రేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఉన్న ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలురకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు వడ మాలలు, తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆటోని ఢీకొన్న కారు : ఒకరికి గాయాలు

రేణిగుంట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆటోని కారు ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం పాత చెక్‌పోస్ట్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు పాత చెక్‌పోస్ట్ మలుపు వద్ద ఆటోని ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొనడంతో ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. కారు డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడపడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యానాదివెట్టులో గ్రామసభ

వరదయ్యపాళెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి: మండలం యానాదివెట్టులో గ్రౌండ్ వాల్యుయేషన్ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. గ్రౌండ్ వాల్యుయేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దారు రాజశేఖర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ప్రసాదరావు, మండల భూసర్వే అధికారి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో గంధమనేని చిత్రపటం ఏర్పాటు



గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, స్వర్గీయ గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ చిత్రపటానికి మంగళవారం ఎమ్మెల్యే ఆదిమూలం పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గంధమనేని ఫొటోను పార్టీ కార్యాలయంలో నిరంతరం ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు పద్దురాజు, జయచంద్ర నాయుడు, వాసురెడ్డి, దొరవేలు, రవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పిచ్చాటూరు జడ్పీ హైస్కూలులో హిందీ పండిట్, డాక్టరేట్ గ్రహీత రాయల్ మల్లీశ్వరిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న ఎంఈవో హేమమాలిని గజమాల వేసి, శాలువతో సత్కరించారు.

కారణిలో సచివాలయం ఏర్పాటుపై ఎంపీడీవో విచారణ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారణి పంచాయతీలో సచివాలయం ఏర్పాటుపై ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు మంగళవారం గ్రామస్తులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచనపుత్తూరు, కారణి, నెర్రిణి కండ్రిగ పంచాయతీలకు కలిపి కంచనపుత్తూరు గ్రామంలో సచివాలయం నిర్వహిస్తున్నారని, అయితే ప్రభుత్వం లెక్కల్లో కారణి పంచాయతీలో ఉన్నట్లు తెలిపారు. కారణి సర్పంచ్ పద్మమ్మ కంచనపుత్తూరు గ్రామంలో ఉన్న సచివాలయాన్ని కారణి పంచాయతీలో ఏర్పాటు చేయాలని సీఎంవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారని చెప్పారు. దీంతో సీఎంవో కార్యాలయ అధికారులు కారణి పంచాయతీలో సచివాలయం ఏర్పాటుపై విచారణ చేసి వివరాలు అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామస్తులను విచారించినట్లు చెప్పారు. విచారణ వివరాలను సీఎంవో కార్యాలయానికి పంపిస్తామన్నారు. ఈ విచారణలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ క్షేత్ర పరిశీలన



వేరుశనగ, నువ్వుల ప్రదర్శనా క్షేత్రాల్లో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

పిచ్చాటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాస్ కేవీకే కరకంబాడీ వారు జాతీయ ఆహార భద్రతా మిషన్ సహకారంతో నూనె గింజల ఆదర్శ గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రత్యేక సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాల కింద పిచ్చాటూరు మండలంలోని అప్పంబట్టు, కారూరు గ్రామాల్లో నిర్వహించిన వేరుశనగ, నువ్వుల ప్రదర్శనా క్షేత్రాల్లో మంగళవారం క్షేత్ర దినోత్సవం నిర్వహించినట్లు కేవీకే మెడ్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇతర పంట క్షేత్రాలను సందర్శించి, గుర్తించిన సమస్యలకు తగు నివారణ చర్యలు సూచించారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి సంజీవరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు దివ్య, రాము, కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, 90 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

వృక్ష విలాపం...!

● పురపాలక సిబ్బంది దాష్టీకం

● నగల వ్యాపారి మెప్పు కోసం బరి తెగింపు



పాఠశాల ఆవరణలో చెట్లను నరికేస్తున్న పురపాలక సంఘ సిబ్బంది - మున్సిపాలిటీ ట్రాక్టర్‌లో చెట్ల కొమ్మలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున వృక్ష విలాపం వీక్షించిన ప్రజలంతా ఆశ్చర్యపోయారు. పురపాలక పాఠశాలలో దశాబ్దాలుగా ఉన్న భారీ వృక్షాలను కొందరు సిబ్బంది ఓ నగల దుకాణం వ్యాపారి మెప్పు కోసం పెకలించేశారు. ఇదేం దాష్టీకం అంటూ స్థానికులు లబోదిబోమంటూ నిస్సహాయతను వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున చతుర్మాడవీధులు ఉన్నాయి. స్వామి అమ్మవార్లు సంచరించి పవిత్ర మాడవీధుల్లో ఇప్పటికే చెట్లు దాదాపు కనుమరుగైపోయాయి. మాడ వీధుల్లోని దక్షిణం వైపున బజారువీధిలో కొండమిట్ట పురపాలక సంఘ పాఠశాల సుమారు 70 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ పాఠశాల ఆవరణలో పలు భారీ వృక్షాలు ఉన్నాయి. పాఠశాల విద్యార్థులకు ఈ చెట్లు ఎంతో నీడను ఇవ్వడంతో పాటు స్వచ్ఛమైన ప్రాణ వాయువును కూడా అందించేవి. అన్ని వృక్షాల కంటే మర్రిచెట్టు నుంచి అత్యధిక ప్రాణవాయువు వెలువడుతోందని శాస్త్రవేత్తలు చెబుతుంటారు. మర్రిచెట్టు నీడ పాఠశాల నుంచి రోడ్డువైపు రావడంతో వాహనదారులు వేసవిలో అక్కడ సేదతీరేవారు. అయితే పాఠశాలకు సమీపంలో ఉన్న ఓ నగల వ్యాపారికి చెట్ల కొమ్మలు అడ్డంగా మారాయంటూ కొంతకాలంగా పురపాలక సిబ్బంది వద్ద వాపోయేవారు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు కానీ పురపాలక సిబ్బంది ట్రాక్టర్లు, చెట్లను నరికివేసే యంత్రాలతో పాఠశాలకు చేరుకున్నారు. ఆగమేఘాలపై యుద్ధ ప్రాతిపదికన ఆవరణలో ఉన్న చెట్లన్నీ నరికి వేశారు. హుటాహుటిన కొందరు సిబ్బంది చెట్లను నరుకుతుండగా మరికొందరు కొమ్మలను ట్రాక్టర్లతో ఆగమేఘాలపై అక్కడి నుంచి తరలించే ప్రక్రియ సాగించారు. దీనిపై స్థానికులు పురపాలక సంఘ సిబ్బందిని ప్రశ్నించగా, మర్రిచెట్టుపై నుంచి పాములు కిందకు వస్తుండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని, అందుకోసం నరికేశామని తెలిపారు. అయితే మర్రిచెట్టు కాకుండా పక్కనే ఇతర ఫలవృక్షాలు అయిన జామ, నేరేడు వంటి చెట్లను ఎందుకు నరికారని స్థానికులు నిలదీశారు. పురపాలక సిబ్బంది నీళ్లు నములుతూ చకచక చెట్లన్నీ ఖాళీ చేసేశారు.

ముఖ్యమంత్రి కార్యదర్శికి సాదర వీడ్కోలు



కార్తికేయ మిశ్రాకు శ్రీకాళహస్తి కలంకారీ కాన్వాస్‌ను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రాకు తిరుపతి విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకొని మంగళవారం తిరుగు ప్రయాణంలో విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ప్రసిద్ధిగాంచిన ఏర్పేడు మండలం మాధవమాల వుడ్ కార్వింగ్ ఆర్టిజన్ క్లస్టర్‌లో తయారు చేయబడిన వెంకటేశ్వర స్వామి ప్రతిమను, శ్రీకాళహస్తి కలంకారీ క్లస్టర్‌లో తయారు చేయబడిన కలంకారీ కాన్వాస్‌ను కలెక్టర్ అందచేశారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురం అంగన్‌వాడీ కేంద్రంలో 7వ పౌష్టికాహార పక్షోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహారం అందించి, పోషకాహారంపై అధికారులు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప, బజావతి, మహిళా పోలీసు ప్రసన్న, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీ దర్శకుడు మారుతి



ఆలయం వద్ద సినీ దర్శకుడు మారుతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం ప్రముఖ సినీ దర్శకుడు మారుతి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు ఆయనకు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

తహసీల్దార్‌కు సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీదేవిని మండల జనసేన అధ్యక్షుడు బాషా, పలువురు సర్పంచులు, నాయకులు మంగళవారం సన్మానించారు. వారిలో కొత్తపాళెం సర్పంచ్ హరిప్రసాద్, పార్లపల్లి సర్పంచ్ చలపతి, నాయకులు భాస్కర్, బాలజీ, ఢిల్లీబాబు, హరిబాబు, గురవయ్య, మురళీ, లీలాకుమార్, రవికుమార్, హరీష్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

కనమనంబేడులో వైద్య శిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు ఆదేశాలతో డాక్టర్ విద్యాసాగర్ రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. జ్వరాలు ఎక్కువగా ఉన్న వారికి రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి

రేణిగుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని మంగళవారం తారకరామనగర్‌లో సీపీఎం నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలెండర్‌పై రూ.50 పెంచడంతో పేదలపై మరింత భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు హరినాథ్, రాజశేఖర్, సెల్వ, ప్రశాంత్, హేమంత్, ప్రభావతి పాల్గొన్నారు.

సత్యవేడు: పేద ప్రజలపై భారంవేస్తూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.